బోనమెత్తి భక్తిచాటి





నాగోలు సాయినగర్ కాలనీ మైసమ్మ-పోచమ్మ దేవాలయంలో జరిగిన పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, దేవాలయ చైర్మన్ సిద్దల ఐలయ్య



బోనాలకు హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు



నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు దరువులతో ఎల్‌బీనగర్ ప్రాంతాల్లోని బస్తీలన్నీ దద్దరిల్లాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భారీగా తరలివచ్చారు. కొత్తపేట, మోహన్‌నగర్, నాగోలు, బండ్లగూడ, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ పరిధిలో ఎటు చూసినా బోనాల సంబరాలే కనిపించాయి. నాగోలు గ్రామంలో మహంకాళి దేవస్థాన, పోచమ్మ దేవస్థానం కమిటీ, నాగోల్ గ్రామ అభివృద్ధి కమిటీ, నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ తోపాటు ప్రముఖులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరప్ప స్వామి, అక్క మహంకాళి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి బీరప్ప స్వామికి బోనాలను సమర్పించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి, కురుమ సంఘం చైర్మన్ నరసింహా, సెక్రటరీ కోరే ఐలయ్య, చంద్రయ్య, జోగు ఐలయ్య, అగ్గే వెంకటేష్, మగ్గ మహేష్, భూమండ్ల మహేష్, మొలుగు శ్రవణ్, తోటకూర లింగస్వామి, బర్మా శ్రీధర్, తోటకూర శివకుమార్ పాల్గొన్నారు.





ఉత్సవాల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్



నాగోలులో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సాహెబ్‌నగర్ పోచమ్మ ఎల్లమ్మ దేవాలయంలో పూజలో పాల్గొన్న లచ్చిరెడ్డి



బోనాలతో వస్తున్న మహిళలు

సుప్రీం తీర్పుపై సంబరాలు



మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చైతన్యపురి: ఎస్సీ వర్గీకరణ తీర్పు పట్ల పలు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చైతన్యపురి మున్సిపల్ కాలనీలో ఎమ్మార్పీఎస్, బీజేపీ, ఎంఈఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వర్గీకరణతో ఎస్సీ వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌కిరణ్, పిట్ల భాస్కర్, సుధాకర్, నర్సింగరావు, శ్రీను పాల్గొన్నారు.

ఓల్డ్‌మలక్‌పేటలో..

చాదర్‌ఘాట్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని మలక్‌పేట దళిత సేవా సంఘం అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో ఓల్డ్‌మలక్‌పేటలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చౌకి రవికుమార్, సత్యనారాయణ, రాజ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, విష్ణదేవ్ పాల్గొన్నారు.

మహిళను హత్యచేసిన ఘటనలో తల్లి, కుమారుడి రిమాండ్

నాగోలు: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగిన మహిళను సుత్తితో కొట్టి హత్యచేసిన ఘటనలో ఓ మహిళతో పాటు ఆమె కుమారుడిని రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, కొత్తపేటకు చెందిన పత్తి నర్సమ్మ(50) ఎల్‌బీనగర్ భరత్‌నగర్ ఫేజ్–2లో ఉంటూ స్థానికంగా వడ్డీలకు డబ్బులిచ్చేది. నర్సమ్మ ఉండే ఇంటి సమీపంలో ఖమ్మం జిల్లాకు చెందిన సరోజినిరెడ్డి, ఆమె కుమారుడు శివారెడ్డితో కలిసి ఉంటున్నారు. సరోజినిరెడ్డి తన అవసరాల కోసం రూ.20 వేలు అప్పు తీసుకుని రూ. 4 వేలు తిరిగి ఇచ్చింది. మిగతా డబ్బులు ఇవ్వకుండా కాలాయాపన చేస్తోంది. శుక్రవారం రాత్రి నర్సమ్మ సరోజినిరెడ్డి ఇంటికి వెళ్లి తనకు రావాల్సిన డబ్బుల గురించి అడగడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని సరోజినిరెడ్డి తన కుమారుడు శివారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. ఇంటికి వచ్చిన శివారెడ్డి, తల్లి సరోజినిరెడ్డితో కలిసి ఇంట్లో ఉన్న సుత్తితో నర్సమ్మ తలపై కొట్టి హత్యచేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఇటీవల ఖాళీ చేసిన ఓ గదిలోకి మార్చారు. ఇంట్లో పడిన రక్తపు మరకలను తుడిచి కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రత్నించారు. గొడవ విషయాన్ని శివారెడ్డి తన మిత్రుడు రమేష్‌కు తెలిపాడు. అతను పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో నర్సమ్మ హత్యకు కారకులైన సరోజినిరెడ్డి, శివారెడ్డిని శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల చెంతకు తప్పిపోయిన బాలుడు



చాదర్‌ఘాట్: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన ఓ బాలుడు పోలీసుల చెంతకు చేరాడు. చాదర్‌ఘాట్ పోలీసుల వివరాల ప్రకారం.. మలక్‌పేట మహరాజ్ హోటల్ వద్ద నాలుగేళ్ల బాలుడు రోదిస్తూ ఉండటాన్ని గమనించిన స్థానికుల ఫిర్యాదు మేరకు బాలుడిని పీఎస్‌కు తీసుకెళ్లి వివరాలు సేకరించారు. తన పేరు అజాన్, తండ్రి పేరు ముస్తబా అని మిగతా వివరాలు చెప్పలేకపోతున్నాడన్నారు. బాలుడి గురించి తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

శ్రీరస్తు బార్ అండ్ రెస్టారెంట్ సీజ్

హస్తినాపురం: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న శ్రీరస్తు బార్ అండ్ రెస్టారెంట్, హోటల్ ప్రాంగణం బొమ్మరిల్లు కాంప్లెక్స్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాలతో సీజ్ చేశారు. ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండా హోటల్ గదులలో ఉండటానికి అనుమతిస్తూ చట్టవ్యతిరేక చర్యలు ప్రోత్సహించడంతో ఇటీవల యువతి లైంగిక వేధింపులకు కారణమైన హోటల్, బార్‌ను కందుకూరు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని యశోధనగర్‌కాలనీ, ఓంకార్‌నగర్ బైరామల్‌గూడ, సాగర్‌రోడ్డులోని బార్‌ను మూసి వేయించినట్లు తెలిపారు.

జర్నలిస్ట్ కుటుంబానికి చేయూత



అశోక్ పిల్లలకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

సైదాబాద్: అనారోగ్య సమస్యలతో మరణించిన జర్నలిస్ట్ కుటుంబానికి మేడిపల్లికి చెందిన మనూస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ ఆర్ఫాన్ చిల్డ్రన్ సంస్థ చేయూతనందించింది. చంపాపేటలో నివసించే అశోక్ ఓ ఎలక్ట్రానిక్ మీడియాలో మలక్‌పేట నియోజకవర్గ రిపోర్టర్‌గా పని చేశాడు. 2023లో అనారోగ్య కారణాలతో అతను మృతి చెందాడు. నాటి నుంచి ముగ్గురు పిల్లలతో అతని భార్య జ్యోతి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తోంది.వారి కుటుంబ పరిస్థితి గురించి తెలుసుకున్న మనూస్ హెచ్‌హెచ్‌ఓసీ సంస్థ ప్రతినిధులు, అశోక్ ముగ్గురు పిల్లలు చంపాపేటలో చదువుతున్న ఓ ప్రైవేట్ పాఠశాలలో వారి మొదటి టర్మ్ ఫీజులు రూ.21,300 చెల్లించి వారికి అవసరమైన పుస్తకాలను అందజేసారు. మృతి చెందిన జర్నలిస్ట్ అశోక్ కుటుంబానికి భవిష్యత్‌లోనూ అండగా ఉంటామని సంస్థ ప్రతినిధులు భాస్కర్, మనోజ్, ప్రదీప్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వారు 8790005140లో వివరాలు తెలిపితే తగిన సహాయం అందిస్తామన్నారు.

ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారలే!



స్నేహితుల దినోత్సవం సందర్భంగా 20 ఏళ్ల నాటి స్నేహితులు హైదరాబాద్ లుంబినీ పార్క్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాల ద్వారా పరిచయమైన వీరంతా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. పెన్-ఫోన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ద్వారా వీరంతా పలు కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. శరత్, పుల్లారెడ్డి, నాగరాజు, మల్లికార్జున, నాగవీరేంద్ర, అస్లాం షరీఫ్ జిలానీ, వెంకటేశం, రాజయ్య, వేణు, రాజు, టీవీ ఆర్టిస్ట్ మురళీకృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

బోనాలకు రావాలని ఆహ్వానం



దిల్‌సుఖ్‌నగర్: ఈ నెల 10న సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్‌లో ఉన్న పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల గుడి(మూడు గుళ్లు) వద్ద నిర్వహించే బోనాల పండగ, ఫలహార బండి ఊరేగింపు ఉత్సవాలకు రావాలని టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డికి కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌కేపురంలో 10వ తేదీన బోనాలు, 11న రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం, అమ్మవార్లకు బోనాలు సమర్పణ, సాయంత్రం మైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు ఉంటుందన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, ప్రధాన కార్యదర్శి బండి మధుసూదన్‌రావు, నల్లంకి ధనరాజ్ గౌడ్, పగిల్ల భూపాల్‌రెడ్డి, తల్లాటి రమేష్ నేత, సంపత్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ పేరు మార్పు తగదు

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం ఎంత మాత్రం సబబు కాదని ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ కోశాధికారి ఎల్.వీ కుమార్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణకు చేసిన సేవలు చిరస్మరణీయమే కానీ.. పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సురవరం పేరును వేరే కొత్తగా ఏర్పాటు చేసే వర్సిటీలకు పెట్టుకోవాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ఆరాధ్యుడైన పొట్టి శ్రీరాములును గౌరవించడం మనందరి బాధ్యత అని ఎల్.వీ కుమార్ పేర్కొన్నారు. పేరు మార్పు ఆలోచనను విరమించుకుంటే వైశ్య సంఘాల తరపున ఆందోళనలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

17 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

చంచల్‌గూడ: మలక్‌పేట సివిల్ సప్లై అధికారులు శనివారం నిర్వహించిన దాడుల్లో 17 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో చావణి గుడ్డిబౌలీలో మహ్మద్ సాజీద్ (50) అడ్డాల్లో దాడులు నిర్వహించగా బ్లాక్ మార్కెట్ తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాన్ని పట్టుకోగా అందులో 17 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం లభించాయి. వివిధ ప్రాంతాల నుంచి బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు వాహనాన్ని మాదన్నపేట పోలీసులకు అప్పగించారు.

'కామినేని'లో అరుదైన శస్త్రచికిత్స

సాక్షి, సిటీబ్యూరో: అమ్మమ్మ నుంచి అమ్మకు, అమ్మ నుంచి ఇద్దరు కుమారులకు ఒకే రకమైన గుండె సమస్య రావడం చాలా అరుదు. జన్యుపరమైన కారణాలతో ఇలా జరిగినా.. అందులోనూ మర్ఫన్స్ సిండ్రోమ్ అనే అత్యంత అరుదైన సమస్య చాలా అరుదు. ప్రతి లక్ష మందిలో 0.19 మందికే వచ్చే ఈ సమస్యతో బాధపడుతున్న తల్లీ కుమారుడికి కామినేని ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. గుండెలోని ప్రధాన రక్తనాళమైన బృహద్ధమని మార్చి, కృత్రిమ బృహద్ధమని అమర్చారు. శస్త్రచికిత్సలో కీలక పాత్ర పోషించిన వైద్యులు విశాల్ ఖాంటే, రాజేశ్ దేశ్‌ముఖ్, సురేశ్, రవళి సాడేకు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గాయత్రి కామినేని అభినందనలు తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా బాలికల కన్వీనర్‌గా భవాని



దిల్‌సుఖ్‌నగర్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సరూర్‌నగర్ మండల అధ్యక్షురాలిగా పనిచేస్తున్న ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన బాతరాజు భవాని, ఆదివారం రాజేంద్రనగర్ నగరంలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ కౌన్సిల్లో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి, గర్ల్స్ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. ప్రభుత్వ కళాశాలలు, హాస్టల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా నియమించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'జైల్ అదాలత్'లో 40 కేసుల పరిష్కారం

చంచల్‌గూడ: చంచల్‌గూడ పురుషుల జైల్లో శనివారం రాత్రి వరకు నిర్వహించిన జైల్ అదాలత్‌లో 40 కేసులు పరిష్కారమైనట్లు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్ అదాలత్‌లో హైదరాబాద్ నాంపల్లి జడ్జిలు అజేష్‌కుమార్, కుమార స్వామి, రాజు, సంతోష్‌కుమార్, అబ్దుల్ జావేద్ కేసులను పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న పలు కేసులు అదాలత్‌లో ప్రవేశపెట్టగా అందులో 40 కేసులను పరిష్కరించారు. కేసులు పరిష్కారమైన వారిలో 32 మంది విచారణ ఎదుర్కొంటున్న ఖైదీలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు నిరంజన్‌రెడ్డి, దేవ్లా, జైలర్లు జలంధర్, దేవ్‌సింగ్, అచ్చయ్య, తిరుమల్‌రెడ్డి, మధు, రామకృష్ణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'లా' పరీక్షలను వాయిదా వేయాలి

చంచల్‌గూడ: పండగల రోజున పరీక్షలు పెట్టడం సరికాదని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుసురు సహదేవ్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ నెలలో జరగనున్న ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పరీక్షలు వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగ రోజు ఉన్నాయని ప్రభుత్వం పునరాలోచించి పరీక్షలను వేరే తేదీలకు మార్చాలన్నారు.



భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్‌లో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



చైతన్యపురి: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ కేలండర్‌పై హర్షం వ్యక్తం చేస్తూ చైతన్యపురిలోని భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాల్యాద్రి మట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ కేలండర్‌తో నిరుద్యోగ యువతకు ముందస్తు ప్రిపరేషన్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఎస్ఐ, కానిస్టేబుల్‌తో పాటు ఇతర నోటిఫికేషన్లు విడుదల చేసినప్పుడు సమయం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించే వారన్నారు. ఈ సారి పరీక్ష తేదీలు ముందుగానే తెలుసుకునే అవకాశం ఉండటంతో ఉద్యోగాలు సాధించడం సులభం అవుతుందన్నారు.

న్యూ నాగోల్ కాలనీకి నూతన కమిటీ ఎన్నిక



నాగోలు: కొత్తపేట్ డివిజన్ న్యూ నాగోల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా పోచంపల్లి రాజేందర్ రెడ్డి (పీఎంఆర్‌రాజు), ప్రధాన కార్యదర్శిగా మోహన్ రాజు, కోశాధికారి తిమ్మారెడ్డి, సహాయ కార్యదర్శి మాల్లారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పీవీ శైలేందర్, శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులుగా కృష్ణవేణి, కాట శ్రీశైలం గౌడ్, సత్యనారాయణ రెడ్డి, కల్చరల్ సెక్రటరీగా శిధర్ రెడ్డి, ముఖ్య సలహాదారులు అనంతుల రాజారెడ్డి, అడ్వైజర్‌గా సుమతి రెడ్డిని ఎన్నుకున్నారు.

నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్‌పై శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న విద్యాధికారులు

చాదర్‌ఘాట్: కోవిడ్ అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు తగ్గినట్లు పలు సర్వేలలో వెల్లడైంది. ఈ క్రమంలో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించి మరింత రాణించే దిశలో వారిని సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇందులో భాగంగానే విద్యార్థులు ఏఏ సబ్జెక్టులో వెనకబడుతున్నారు.. కారణం ఏంటి లాంటి అంశాలను తెలుసుకునేందుకు నవంబర్‌లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. విద్యార్థులను ఈ టెస్ట్‌కు సన్నద్ధం చేసే దిశలో ఇప్పటి నుంచే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించింది. మలక్‌పేట పరిధిలోకి వచ్చే 20 ప్రాథమిక, 10 ఉన్నత పాఠశాలల పరిధిలో 3, 6, 9 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు శనివారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పేరిట నిర్వహించనున్న ఈ పరీక్షకు రెండు విడతలుగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడతలో శనివారం అంబర్‌పేట మండల పరిధిలోని 40 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధిస్తారని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



కైరంకొండ వివేక్

నాగోలు: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటనలు నాగోలు, చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకున్నాయి. నాగోలు సాయినగర్ కాలనీలో నివాసముండే కైరంకొండ వివేక్(30) షేర్ మార్కెట్ ట్రేడింగ్ చేస్తుంటాడు. ఈ నెల 2న కొత్తపేటలో స్నేహితుడిని కలిసేందుకు వెళ్లి రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, అతడి స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తల్లి మాలతి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చాదర్‌ఘాట్ పరిధిలో..



బాలకృష్ణ

చాదర్‌ఘాట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. చాదర్‌ఘాట్ పోలీసుల వివరాల ప్రకారం.. మలక్‌పేట మహబూబ్ మాన్షన్‌లో నివసించే బాలకృష్ణ (64) గత నెల 19న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



విద్యార్థుల బారులు.. బస్సెక్కేందుకు పరుగులు

దిల్‌సుఖ్‌నగర్‌లో ఉన్న వివిధ కోచింగ్ సెంటర్లు, కాలేజీలు, ఇనిస్టిట్యూట్‌కు వివిధ ప్రాంతాల విద్యార్థులు, శిక్షణ తీసుకునేందుకు వస్తున్న వారితో నిత్యం కిటకిటలాడుతోంది. ఉదయం సాయంత్రం ఆయా ప్రాంతాల్లోని బస్టాప్‌లు కిక్కిరిపోతాయి. ఓ బస్టాప్‌లో బస్సుల కోసం విద్యార్థులు, వేచి ఉండి బస్సు రాగానే పరుగులు తీస్తూ ఎక్కుతున్న దృశ్యాన్ని 'సాక్షి'క్లిక్ అనిపించింది. – సాక్షి, సిటీబ్యూరో

